క్లుప్తంగా

పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



నెల్లూరు(వేదాయపాళెం): ఎమ్మెల్సీ ఎన్నికల్లో వామపక్షాలు బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిరాజ్ పిలుపునిచ్చారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులు వెంకటేశ్వర్లురెడ్డి, బాబురెడ్డికి మద్దతుగా నగరంలో ప్రచారాన్ని సీపీఐ నేతలు బుధవారం నిర్వహించారు. ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, గోపాల్, లతీఫ్, రఫీ, వెంకటేశ్వర్లు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న శ్రీనివాసులునాయక్

నెల్లూరు రూరల్: హక్కులపై మహిళలకు పూర్తి స్థాయి అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. దేవరపాళెంలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలకు ఉచిత న్యాయసాయాన్ని అందిస్తున్నామని చెప్పారు. బాల్య వివాహాల నిరోధానికి తగు చర్యలు చేపడుతున్నామని వివరించారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం



పొదలకూరు : మండలంలోని తాటిపర్తి గ్రామంలో రుక్మిణి సమేత పాండురంగస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి పండరి భజనలు అత్యంత వైభవంగా జరిగాయి. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో గ్రామపెద్దలు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

వసంతోత్సవం, ఏకాంతసేవ

బ్రహ్మోత్సవాల చివరిరోజైన బుధవారం వసంతోత్సవం, ఏకాంత సేవ నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, ధ్వజారోహణం, హోమం, నైవేద్యం, తీర్థప్రసాద వినియోగం జరిగింది. చివరగా గ్రామోత్సం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేశారు.

పదో తరగతి విద్యార్థినులకు పౌష్టికాహారం



పొదలకూరు : పట్టణంలోని డీఎన్నార్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సూచనలతో బుధవారం నుంచి పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పొదలకూరు సర్పంచ్ మల్లిక చిట్టెమ్మ చేతుల మీదుగా ఉపాధ్యాయినులు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో పీసీ చైర్మన్ సురేఖ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ సేవలు అభినందనీయం

కొడవలూరు : అనాథాశ్రమంలో బాలబాలికలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి కొనియాడారు. నార్తురాజుపాళెం మజరా టపాతోపులోని విశ్వజనని అనాథాశ్రమంలో ఆధునిక హంగులతో నూతనంగా నిర్మించిన భోజనశాలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలోని బాలలకు సకల వసతులు కల్పించడంతో పాటు మంచి పౌష్టికాహారం, విద్య, వినోదం అందిస్తూ సొంత బిడ్డల్లా చూసుకోవడం సంతృప్తినిచ్చిందన్నారు. ఆశ్రమ అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ ఆశ్రమ అభివృద్ధికి దాతలు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, సర్పంచ్ బి.సుప్రియ, డీఎల్‌డీఏ డైరెక్టర్ ఎం.మల్లికార్జున, నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, ఎండి.కరిముల్లా, ఇసనాక సునీల్‌రెడ్డి, బి.శ్రీనివాసులు, ఆశ్రమ నిర్వాహకులు బుర్లా శ్రీలక్ష్మి, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

స్త్రీలే సమాజ నిర్మాతలు

• ఘనంగా మహిళా దినోత్సవం

నెల్లూరు (అర్బన్): స్త్రీలే సమాజ నిర్మాతలని పలువురు పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పలు ప్రాంతాల్లో మహిళా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను సత్కరించారు.

• వీఆర్సీ మైదానంలో మహిళా దినోత్సవాన్ని వనిత వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సామాజిక సేవలో ముందున్న డాక్టర్ సులోచనను సత్కరించారు, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ రియాజ్ అహ్మద్, వాకర్స్ జిల్లా గవర్నర్ ఎమ్వీ రెడ్డి, డాక్టర్లు పెంచలయ్య, భాస్కర్‌రావు, సీనియర్ అడ్వొకేట్ నన్నేసాహెబ్, డాక్టర్ శైలజ, సుభాషిణి, ఉషా, ఇంటర్నేషనల్ గవర్నర్ సుబ్బారెడ్డి, వనిత వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

• దర్గామిట్టలోని కిమ్స్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. అనంతరం పలువురు సీనియర్ మహిళలు, డాక్టర్లు, సిబ్బందిని సత్కరించారు. డీజీఎం శివమాల, డాక్టర్లు లక్ష్మీదుర్గ, సంఘమిత్ర, ప్రతిమ, దీప్తి, మంజీర, అభినయరెడ్డి, స్వాతి, సరిత, తదితరులు పాల్గొన్నారు.

• మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో రెడ్‌క్రాస్ సంస్థాపకులు హెన్రీ డ్యూనాట్, స్వాతంత్ర్య సమరయోధురాలు కనకమ్మ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. సంస్థ ఇన్‌చార్జి చైర్మన్ సుధీర్‌నాయుడు, మానసిక దివ్యాంగుల కేంద్ర ప్రిన్సిపల్ గురునాథ్, రెడ్‌క్రాస్ ఎమ్సీ సభ్యులు రాజేంద్రప్రసాద్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

• మహిళాభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని సెయింట్ జోసఫ్స్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సిస్టర్ స్టెల్లా పేర్కొన్నారు. నగరంలోని ఆస్పత్రిలో మహిళా దినోత్సవాన్ని ఒమేగా ప్రేయర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించి సిబ్బందికి జ్ఞాపికలను అందజేశారు. డాక్టర్ గ్లోరీ, కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, డాక్టర్ మంజులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

• వరపరివార్ సేవా ఫౌండేషన్ అధ్యక్షురాలు మాధవిని నగరంలోని రావూస్ కళాశాలలో సత్కరించారు. పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, ప్రొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ చైర్మన్ చక్రవర్తి ఆధ్వర్యంలో సన్మానించి వరల్డ్ గోల్డ్ హ్యుమానిటేరియన్ ఉమెన్ అవార్డును అందజేశారు.



మాట్లాడుతున్న లక్ష్మి

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌లోని ఆర్ఎం కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన మహిళా ఉద్యోగులు, సిబ్బందిని జిల్లా ప్రజా రవాణాధికారి శేషయ్య అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. పీఓ రమణ, అకౌంట్స్ ఆఫీసర్ నాగలక్ష్మి, నెల్లూరు ఒకటో, రెండో డిపో మేనేజర్లు మురళీకృష్ణ, శివకేశవ్‌యాదవ్, ఏటీఎం కమర్షియల్ దివ్యకామాక్షి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): గాంధీబొమ్మ సెంటర్‌లోని డీసీసీబీలో కేక్‌ను మహిళా ఉద్యోగులు కట్ చేశారు. ఆప్కాబ్ డీజీఎం సత్యవతి, బ్యాంక్ జనరల్ మేనేజర్ సరిత, డీజీఎంలు ఉషారాణి, నాగేంద్రకుమారిని సత్కరించారు. బ్యాంక్ మహిళా ఉద్యోగులకు నిర్వహించిన చెస్, క్యారమ్స్, షటిల్, రింగ్‌బాల్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. బ్యాంక్ సీఈఓ శంకర్‌బాబు, జనరల్ మేనేజర్ సరిత, నాబార్డు డీడీఎం రవిసింగ్, బ్యాంక్ జనరల్ మేనేజర్ సరిత, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కుమార్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వేదాయపాళెం): గాంధీనగర్‌లోని మహిళా ప్రాంగణంలో మహిళా దినోత్సవాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి సౌజన్య, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, ఎస్సీసీసీ అధికారి బాలకృష్ణ, అర్బన్, వెంకటాచలం సీడీపీఓలు అన్నపూర్ణ, విజయలక్ష్మి, ఏసీడీపీఓలు లక్ష్మీదేవి, అనూరాధ, సర్వీస్ హోమ్ అధికారి మాధవి, ఎన్జీఓ ప్రతినిధి కవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

• దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో దిశ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యురాలు లక్ష్మి, సామాజికవేత్త వసుంధర, న్యాయవాది రమాదేవి, రోజారాణి, విమలమ్మ, కీర్తి, తదితరులు పాల్గొన్నారు.

• గాంధీబొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ వరకు ప్రదర్శనను స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పురమందిరంలో సభను జరిపారు. రామచంద్రారెడ్డి హాస్పిటల్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు, ఏఐఎఫ్టీయూ నేత లక్ష్మీరెడ్డి, స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అజిత, జిల్లా కార్యదర్శి కొండమ్మ, కార్యవర్గ సభ్యులు జయమ్మ, శ్యామల, పిచ్చమ్మ, రిషిత, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

• వేదాయపాళెంలోని మన్సూర్ భవన్‌లో ఐద్వా రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జక్కా పార్వతమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. సీపీఎం రూరల్ కార్యదర్శి కృష్ణయ్య, ఐద్వా నేతలు వరలక్ష్మి, శేషమ్మ, షాహినాబేగం, షంషాద్, సుజాత, సంపూర్ణ, పర్వీన్, విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని వెలమ సంఘ భవనంలో మహిళా దినోత్సవాన్ని ఏసీ స్టేడియం ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రెడ్‌క్రాస్ కేన్సర్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, వాకర్స్ గవర్నర్ వెంకటాద్రిరెడ్డి, ఇంటర్నేషనల్ ట్రెజరర్ బలరామయ్యనాయుడు, ఆర్సీ రాఘవరెడ్డి, హరిబాబు, రామ్మోహన్‌రెడ్డి, నసీర్ అహ్మద్, శ్రీమన్నారాయణ, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): విద్యతో పాటు సామాజిక బాధ్యతలో మహిళలు ముందుండాలని డాక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. సరస్వతీనగర్‌లోని ఐఎంఏ హాల్లో మహిళా దినోత్సవాన్ని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పలువురు మహిళలను సత్కరించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరంజీవి, భానుతేజ, జిల్లా ఉపాధ్యక్షులు సులోచనమ్మ, రాష్ట్ర కౌన్సిలర్ మొహసినా, విజయభారతి, సుధారాణి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి, పిచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

• మద్రాస్ బస్టాండ్ సమీపంలోని జీవీకే మెమోరియల్ ఆస్పత్రి హాల్లో ఏపీటీఎఫ్ నేతలు సురేఖ, శ్రీదేవి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులు వహీదాభాను, భారతి, రత్నమ్మ, స్నేహలత, వసంతలక్ష్మిని సత్కరించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దశరథరాములు, ప్రధాన కార్యదర్శి హజరత్తయ్య, గౌరవాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మాజీ రాష్ట్ర నేత సుధాకర్ రెడ్డి, రహంతుజానీ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని డీఎస్సార్ కల్యాణ మండపంలో బ్రాహ్మణ మహిళా దినోత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. బ్రాహ్మణ మహిళలు విజయరాణి, లక్ష్మీభవాని, తులసీమణి, అరుణాదేవి, తదితరులను సత్కరించారు. అనంతరం బ్రాహ్మణ సేవా సంఘాల సమితి జిల్లా కార్య నిర్వాహక అధ్యక్షుడిగా నారాయణరావును ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లో సీవీ రామన్ అకాడమీ సాంస్కృతిక విభాగ సువర్ణ కంకణ జ్ఞాపక అర్చక వైభవ పరిపూర్ణ బిరుదును అందుకున్న ఫణికుమార్‌శర్మను సన్మానించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసుదేవరావు, కామేశ్వరప్రసాద్, న్యాయ విభాగ కన్వీనర్ నారాయణరావు, జిల్లా మహిళా విభాగ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మావతి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

• బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో వృద్ధులకు మందులను సమీర్ సహకారంతో అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సరళ, అపర్ణ, సుమతి, శైలజ, తదితరులను సత్కరించారు. సుధాలక్ష్మి, వంశీ, ప్రియ, శశికిరణ్, కార్తికేయ, పాండు, తదితరులు పాల్గొన్నారు.

• పొదలకూరు రోడ్డులోని వియానీ హోమ్‌లో 20 మంది బాలికలకు పౌష్టికాహారాన్ని అబైడింగ్ హోప్ ట్రస్ట్ నిర్వాహకుడు నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. ఫాదర్ ఇన్నయ్య, ఫాదర్ రాసారియ, ధర్మారావు, క్రాంతికుమార్, సిస్టర్లు థెరీసా, రుబియా, రమా, జయ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జెడ్పీ వాకర్స్ మహిళా సభ్యులను సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు నారాయణరెడ్డి, డిప్యూటీ గవర్నర్ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి ఖాజామస్తాన్, కోశాధికారి చెంచయ్య, కృష్ణయ్య, రాజగోపాల్, ఎస్తేరురాణి, హరిసుధ, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ భవన్‌లో..



ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయంలో..



కిమ్స్‌లో..



ఐఎంఏ హాల్లో..



బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో..



డీసీసీబీలో..



జెడ్పీ హైస్కూల్ ఆవరణలో..

నేత్రపర్వంగా రంగనాథుడి కల్యాణోత్సవం



కల్యాణ మహోత్సవం



వీక్షిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): పవిత్ర పినాకినీ తీరం శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథ స్వామి వారి కల్యాణోత్సవ వేడుకతో శోభిల్లింది. వేదపండితులు, అర్చకుల వేదమంత్రోచ్చారణలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహోత్సవాన్ని వీక్షించేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. తొలుత పూలంగిసేవను కనుల పండువగా నిర్వహించారు. టీటీడీ నుంచి వచ్చిన సిబ్బంది స్వామివార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఎదుర్కోలు ఉత్సవాన్ని వేదపండితులు, అర్చకులు నిర్వహించారు. అర్ధరాత్రి ఒంటి గంటకు గజవాహనసేవలో దర్శనమిచ్చారు. ఆయా సేవలకు ఉభయకర్తలుగా సుధాకర్‌నాయుడు, విద్యాసాగర్, గోపాలకృష్ణయ్య, బాలసుబ్రహ్మణ్యం, నాగరాజారావు వ్యవహరించారు.

రథోత్సవం నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని గురువారం ఉదయం 8.30కు, పొన్నవాహనసేవను రాత్రి నిర్వహించనున్నామని ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండల చైర్మన్ శివకుమార్ ఆచారి తెలిపారు.

రేషన్ షాపులో తనిఖీలు

• 11464 కిలోల బియ్యం తక్కువగా ఉందని గుర్తింపు

నెల్లూరు(క్రైమ్): నగరంలోని ఓ రేషన్‌షాపులో సివిల్ సప్లయ్స్ అధికారులు తనిఖీలు చేశారు. బియ్యం, పంచదార తక్కువగా ఉండటాన్ని గుర్తించి నిర్వాహకులపై నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉడ్‌హౌస్ సంఘంలోని రేషన్‌షాపులో సివిల్ సప్లయ్స్ నెల్లూరు అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ గోపికృష్ణ తన సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో పలు అక్రమాలను గుర్తించారు. షాపులో నిర్దిష్ట మోతాదుకంటే బియ్యం 11464.96 కిలోలు, పంచదార అర కిలో ప్యాకెట్లు 215 తక్కువగా ఉండటాన్ని గుర్తించారు. రేషన్‌షాపు డీలర్ సుకన్యపై చర్యలు చేపట్టాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్రైమ్ కార్నర్

పాముకాటుకు వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పొలం గట్టుపై నడుస్తుండగా పాముకాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు బుధవారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా ర్యాకలదేవిపల్లికి చెందిన నర్సయ్య, లక్ష్మి దంపతుల కుమారుడు త్రిమూర్తి (26)కి ఉమాదేవితో మూడేళ్ల క్రితం వివాహమైంది. అదే గ్రామానికి చెందిన హేమేంద్రరెడ్డికి సంబంధించిన వరికోత యంత్రానికి ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. అంబాపురంలో ఆదిశేషయ్యకు చెందిన పొలంలో వరికోత కోసం యంత్రంతో సహా ఈ నెల ఐదున వచ్చారు. పొలంలో గట్టుపై మంగళవారం నడుస్తుండగా, త్రిమూర్తి ఎడమకాలిపై పాము కాటేసింది. దీంతో ఆయన పెద్దగా కేకలేసి అక్కడే కుప్పకూలిపోయారు. విషయాన్ని గమనించిన కూలీలు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి ఆయన్ను తరలించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. త్రిమూర్తి సోదరుడు కిరణ్‌కుమార్ నెల్లూరుకు బుధవారం తెల్లవారుజామున వచ్చారు. వైద్యుల సూచన మేరకు తన సోదరుడ్ని మెరుగైన చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే త్రిమూర్తి మృతి చెందారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కట్నం కోసం ఇంటి నుంచి గెంటివేత

నెల్లూరు(క్రైమ్): కట్నం కోసం ఇంటి నుంచి గెంటేశారని, విచారణ జరిపి న్యాయం చేయాలంటూ నవాబుపేట పోలీసులకు వివాహిత ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఉస్మాన్‌సాహెబ్‌పేటకు చెందిన దివ్యతేజకు ఆత్మకూరుకు చెందిన మహేష్‌తో సుమారు రెండున్నరేళ్ల క్రితం వివాహమైంది. ఆ సమయంలో కట్నం వద్దని వారు చెప్పారు. కృష్ణపట్నం పోర్టులో పనిచేస్తున్న మహేష్ తన భార్యతో కలిసి ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అత్తామామల వద్దే ఉంటూ ఉద్యోగానికి వెళ్లొచ్చేవారు. ఏడాది క్రితం వారు ఆత్మకూరుకు వెళ్లారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం భర్త, అత్తింటి వారు కట్నం కోసం దివ్యతేజను వేధించడం ప్రారంభించారు. ఈ విషయమై బాధితురాలు తన తల్లిదండ్రులకు చెప్పగా, సర్దుకోవాలని వారు సూచించారు. అయినా భర్త, అత్తింటి వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. కట్నం కోసం ఆమెను ఇంటి నుంచి గెంటేశారు. పెద్ద మనుషులు సర్దిచెప్పేందుకు యత్నించినా ప్రయోజనం లభించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కానిస్టేబుల్‌కు గాయాలు

నెల్లూరు(క్రైమ్): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కానిస్టేబుల్ స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. కంట్రోల్ రూమ్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మణిపాల్ ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం నుంచి బైక్‌పై బయటకొస్తుండగా, ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో ఆయన స్వల్పంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం ఆయన్ను జీజీహెచ్‌కు తరలించారు.

బైక్ ఢీకొని నర్సుకు..

గుర్తుతెలియని బైక్ ఢీకొనడంతో నర్సు గాయపడిన ఘటన ఆత్మకూరు బస్టాండ్‌లోని అండర్ బ్రిడ్జి వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. తోటపల్లిగూడూరు మండలం చింతోపునకు చెందిన శ్రీలేఖ నగరంలోని మెటర్నిటీ హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తున్నారు. హాస్పిటల్‌కు వెళ్లేందుకు గానూ ఆత్మకూరు బస్టాండ్‌కు బస్సులో వచ్చారు. ఆటో ఎక్కేందుకు బోసుబొమ్మ వైపు వెళ్తుండగా, వెనుక నుంచి గుర్తుతెలియని బైక్ ఆమెను వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయపడిన ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారమ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారీని ఢీకొని వాహనచోదకుడికి..

మద్యం మత్తులో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో వాహనచోదకుడు గాయపడిన ఘటన ఆత్మకూరు బస్టాండ్ ఫ్లయ్‌ఓవర్‌పై బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. సుబేదారుపేటకు చెందిన శివరామ్ హరిరామ్ పూటుగా మద్యం సేవించారు. అనంతరం తన స్కూటీపై రైల్వేస్టేషన్ వైపు నుంచి ఆత్మకూరు బస్టాండ్ ఫ్లయ్‌ఓవర్‌పై వెళ్తూ ఎదురుగా వస్తున్న ట్రాన్స్‌పోర్ట్ లారీని ఢీకొన్నారు. ఘటనలో ఆయన స్వల్పంగా గాయపడగా, స్కూటీ ముందుభాగం దెబ్బతినింది. నార్త్ ట్రాఫిక్ ఎస్సై గీతారమ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రంగనాథస్వామి రథోత్సవాన్ని గురువారం నిర్వహించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నామని వెస్ట్ - 2 ఏఈ ఉదయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగనాయకులపేట, ఇసుక డొంక, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

ఫోరెన్సిక్ నిపుణుడు శశికాంత్‌కు ఉద్యోగోన్నతి

నెల్లూరు (అర్బన్): జీజీహెచ్‌లో ఫోరెన్సిక్ నిపుణుడిగా పనిచేస్తున్న డాక్టర్ శశికాంత్‌కు ఉద్యోగోన్నతి కల్పించి గుంటూరు జీజీహెచ్ ప్రొఫెసర్‌గా బదిలీ చేశారు. ఈ మేరకు మెడికల్ అండ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయండి




మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అభ్యర్థులకు మద్దతుగా రూరల్ పరిధిలోని కాకుపల్లిలో ఇంటింటి ప్రచారాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన వారిని కలిసి తమ పార్టీ అభ్యర్థులకు ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి విజయానికి పాటుపడాలని కోరారు. రూరల్ పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యేలా చర్యలు చేపడతానని తెలిపారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, సర్పంచ్ సుభాషిణి, నేతలు కేశవులు, కమలాకర్ రెడ్డి, సునీల్‌రెడ్డి, సుధీర్‌కుమార్‌రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు వెంకయ్య, ఏసునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో మహిళా టీచర్లకు ప్రత్యేక ప్యాకేజీ



నెల్లూరు (అర్బన్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని మెడికవర్ స్పెషాల్టీ ఆస్పత్రిలో మహిళా టీచర్లకు వైద్యాన్ని అందించే ప్రత్యేక ప్యాకేజీ బ్రోచర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెంటర్ హెడ్ డాక్టర్ గణేష్ మాట్లాడారు. రూ.ఐదు వేల విలువ గల వైద్య చికిత్స ప్యాకేజీని రూ.600కే అందించనున్నామని చెప్పారు. ఉచిత కన్సల్టేషన్‌ను సైతం అందించనున్నామని, ఈ అవకాశం నెలాఖరు వరకే అని తెలిపారు. అనంతరం మహిళా దినోత్సవాన్ని నిర్వహించి పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. డాక్టర్లు హిమబిందు, ప్రియ, నిషితారెడ్డి, సాహిత్య, శ్రీజ, భావన, మార్కెటింగ్ రీజినల్ హెడ్ ఉదయభాస్కర్, హెచ్‌ఆర్ మల్లేష్ పాల్గొన్నారు.

శ్రీశ్రీ కళావేదిక సేవలు ఆదర్శనీయం

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (అర్బన్): సాహిత్య రంగంలో యువతను ప్రోత్సహించేందుకు నిరంతరం కృషి చేస్తున్న శ్రీశ్రీ కళావేదిక సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్లను తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎలాంటి రుసుము లేకుండా వేదికపై తమ ప్రతిభను చాటేలా యువతకు అవకాశం కల్పిస్తున్న సంస్థ శ్రీశ్రీ కళావేదిక అని తెలిపారు. కార్యక్రమంలో వేదిక జాతీయ కన్వీనర్ రమావతి, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు హరిసర్వోత్తమనాయుడు, తిరుపతి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ రాసాని, తెలుగు సాహితీ సాంస్కృతిక అకాడమీ చైర్మన్ ప్రతాప్, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఇంద్ర, తదితరులు పాల్గొన్నారు.